సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025


క్వారీ బ్లాస్టింగ్‌లతో బెంబేలు
పట్టణంలో గల దుర్గానగర్ ఏరియాలో బాంబు బ్లాస్టింగ్‌ల కారణంగా కాలనీవాసులు బేంబేలు చెందుతున్నారు. IIలో


దూసుకొచ్చిన లారీ
ఓ చిరు వ్యాపారిపై మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. IIలో


కలెక్టర్ శ్రమదానం
ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని శ్రమదానం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. IIలో

- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- జేఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులూ ఖాళీ
- 35 మంది లష్కర్లకు ఉన్నది 12 మంది మాత్రమే
- రెండు జిల్లాల పరిధిలో 52 వేల ఎకరాల ఆయకట్టు
- 120 కి.మీ మేర సాగునీటి కాలువలపై అరకొర పర్యవేక్షణ
- తాత్కాలిక సిబ్బందికీ ఊసెత్తని కూటమి ప్రభుత్వం


పర్యవేక్షణ లేక శృంగవరంలో చెరువుని తలపించేలా పంట పొలాల్లో సాగు నీరు నిల్వను చూపిస్తున్న రైతు

తాండవ... పర్యవేక్షణ ఎలా..?

నాతవరం : తాండవ రిజర్వాయరుకు సిబ్బంది సమస్య వెంటాడుతుంది. ఒకప్పుడు పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది ఉండడంతో రైతుకు ఏ సమస్య తలెత్తినా యుద్ధ ప్రతిపాదికన స్పందించే వారు. ప్రస్తుతం కాలువపై ఏ సమస్య వచ్చినా క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది లేక డీఈ లేదా జేఈలే స్వయంగా వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు స్పీకరు అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆర్భాటంగా ఆగస్టు 10వ తేదీన నీటిని విడుదల చేశారు. అయితే ఆయకట్టుకు ప్రవహించే నీటిని పర్యవేక్షించే సిబ్బంది సమస్య మరిచారు.

ఐదు సెక్షన్లకు ఇద్దరే జేఈలు...

తాండవ రిజర్వాయరు పరిధిలో నాతవరం నర్సీపట్నం, తాండవ, కోటనందూరు, కె.ఈ.చిన్నయ్యపాలెం సెక్షన్లు ఉన్నాయి. తాండవ ప్రాజెక్టుకు ఈ ప్రతి సెక్షన్‌కు ఒక జేఈ ఉండాలి. ప్రస్తుతం డీఈతో పాటు నర్సీపట్నం కోటనందూరు సెక్షన్లకు మాత్రమే జేఈలు ఉండగా మిగతా మూడు సెక్షన్లకు జేఈలను నియమించక ఖాళీగా ఉన్నాయి. వీరితో పాటు ఆయా సెక్షన్లకు ఐదుగురు చొప్పున వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. ప్రస్తుతం ముగ్గురే పని చేస్తున్నారు. నర్సీపట్నం, కె.ఈ.చిన్నయ్యపాలెం సెక్షన్లకు వర్క్ఇన్‌స్పెక్టర్లు లేరు. అదే విధంగా ఐదు సెక్షన్లతో పాటు తాండవ ప్రాజెక్టుపై స్పిల్‌వే గేట్ల వద్ద తాండవ కాలువపై పర్యవేక్షణకు తాండవ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 35 మంది లష్కర్లు ఉండేవారు. ప్రస్తుతం ఐదు సెక్షన్ల పరిధిలో 12 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరితో పాటు ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభం దగ్గర్నుంచి ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసేంత వరకు సుమారుగా 5 నెలలు పాటు తాత్కాలికంగా సిబ్బందిని నియమించేవారు. వారు నిత్యం కాలువలో నీటి ప్రవాహంపై పర్యవేక్షణ ఉండేవారు. ఎక్కడా నీరు వృథా కాకుండా చూడడంతో పాటు రైతులకు ఏ సమస్య వచ్చినా సకాలంలో స్పందించడం చేసేవారు. ఈ ఏడాది తాత్కాలిక సిబ్బందిని కూటమి ప్రభుత్వం నియమించలేదు. తాండవ ప్రాజెక్టుపై సిబ్బంది పూర్తి స్థాయిలో లేక ఎప్పుడు చూసినా ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన గేటు వద్ద వాచ్‌మెన్ రూమ్ మూసే ఉంటుంది. ఉన్నతాధికారులు వచ్చేటప్పుడు లేక ప్రాజెక్టు నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. స్పిల్‌వే గేట్ల వద్ద నిత్యం నలుగురు సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి.


లష్కర్లు లేక కాలువపై జేఈ శ్యామ్‌కుమార్ పర్యవేక్షణ


ఆగస్టు 10న తాండవ నీరు విడుదలకు వచ్చిన స్పీకరు అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత (ఫైల్)

మజ్దూర్లనూ నియమించలేదు..

తాండవ రిజర్వాయరు నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో ఆరు మండలాల్లో 52 వేల ఎకరాల్లో ఆయకట్టు కలిగి ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు 120 కిలోమీటర్లు మేర తాండవ కాలువలో నీరు ప్రవహిస్తుంది. ఆయకట్టుకు నీరు ప్రవహించే అన్ని రోజులు లష్కర్లు నిత్యం పర్యవేక్షణ ఉండాలి. ఒక్క లష్కరు నాలుగు నుంచి అయిదు కిలోమీటర్లు మేర కాలువపై పర్యవేక్షిస్తుంటారు. లష్కర్లతో పాటు ప్రతి ఏటా సీజన్‌లో తాత్కాలికంగా నియమించుకునే మజ్దూర్‌లు సైతం కాలువలపై పని చేస్తుంటారు, లష్కర్ల పోస్టులు ఖాళీలు భర్తీ చేయక, మజ్దూర్లను నియమించక ఈ ఏడాది కాలువపై పర్యవేక్షణ కొరవడింది. చాలా చోట్ల కళ్ల ముందే తాండవనీరు వృథాగా బయటకుపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో తాండవ ఆయకట్టు పరిధిలో ప్రతి ఏటా తమ భూములకు రైతులు చెల్లించే డబ్బులతో అధికారులు తాత్కాలికంగా సిబ్బందిని నియమించేవారు. ఈ ఏడాది మాత్రం కూటమి ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదు. ఇతర జిల్లాల్లో మాత్రం ప్రాజెక్టుల పరిధిలో సిబ్బందిని నియమించారు. ఉమ్మడి జిల్లాలోనే మేజర్ ప్రాజెక్ట్ తాండవ ఒక్కటే కాబట్టి ఆయకట్టుదారుల ఇబ్బందులను గమనించి కచ్చితంగా సీజన్‌లో సిబ్బందిని నియమించాలి.


తాండవ ప్రాజెక్టు ప్రధాన గేటు వద్ద మూసి ఉన్న వాచ్‌మెన్ రూము

ప్రతిపాదనలు పంపించాం



తాండవ ప్రాజెక్టు పరిధిలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నాం. ఏ సమస్య వచ్చినా నేను జేఈలు స్వయంగా కాలువలను సందర్శించాల్సి వస్తోంది. తాత్కాలిక సిబ్బంది నియామకాల కోసం ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. తాండవలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తే బాగుంటుందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–అనురాధ, డీఈ, తాండవ ప్రాజెక్టు

రూ.30 లక్షలు వసూలు చేశాం



ఈ ఏడాది తాండవ ఆయకట్టు రైతుల నుంచి నీటి తీరువా పన్నులు రూ. 30 లక్షలకు పైగా వసూలు చేశాం. ఇంకా చాలా భూములకు పన్నులు వసూలు చేయాల్సింది. జాయింట్ కలెక్టరు పన్నుల వసూలు విషయంపై చాలా సీరియస్‌గా ఉన్నారు. ఈ విషయంపై వీఆర్వోలకు సూచనలు చేశారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి పన్నులు కట్టించాలంటున్నాం

–ఎ.వేణుగోపాల్, తహసీల్దార్, నాతవరం మండలం

నిబంధనల మేరకు బాణసంచా అనుమతులు

- ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి
- కలెక్టరు విజయ కృష్ణన్

తుమ్మపాల : బాణసంచా దుకాణాలకు నిబంధనల మేరకు వెంటనే లైసెన్సులు మంజూరు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ లైసెన్సు మంజూరు చేసిన తరువాత దుకాణాలు ఏర్పాటుకు అనుసరించవలసిన నిబంధనలు కఠినంగా అమలు చేసేలా పర్యవేక్షించాలన్నారు. జనావాసాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటుచేయాలని, ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని బాణసంచా తయారీ కేంద్రాలను వెంటనే మూసివేయాలన్నారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ విక్రయ దుకాణాలకు దగ్గరగా మండే స్వభావం కలిగిన పదార్థాలు ఉండకూడదన్నారు. ఎలక్ట్రికల్ వైరింగు షార్ట్ సర్క్యూట్ కాకుండా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా , రెవిన్యూ డివిజినల్ అధికారి వై.సత్యనారాయణరావు, అదనపు ఎస్పీ మోహనరావు, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ప్రాంగణంలో మతాబులు వెలిగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

కలెక్టరేట్‌లో ముందస్తు దీపావళి సంబరాలు

దీపావళి పండగను పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి కాకర పువ్వులు, చిచ్చుబుడ్లు వెలిగించి సందడి చేశారు. పండగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో ముందుగానే సిబ్బందితో కలిసి దీపావళి సంబరాలు జరుపుకొన్నారు. ప్రజలందరూ సంతోషంగా దీపావళి జరుపుకోవాలని అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణరావు, పరిపాలన విభాగం అధికారి విజయకుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా విక్రయిస్తే చర్యలు

- ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బాణసంచాను అనుమతి లేకుండా తయారు చేయడం, నిల్వ ఉంచడం, విక్రయించడం నేరమని అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం అగ్నిప్రమాదాల నివారణ కోసం స్పష్టమైన నిబంధనలు నిర్దేశించిందని, ప్రజల భద్రత కోసం వాటిని కచ్చితంగా పాటించాలన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలని స్పష్టం చేశారు. బాణసంచా విక్రయం/తయారీకి అనుమతి ఉన్న షాపులు అగ్నిప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, తాత్కాలిక లైసెన్స్ కలిగిన వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల ప్రకారం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి విక్రయదారు తమ షాపులో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు వంటి సాధనాలు సిద్ధంగా ఉంచుకోవాలని, మైనర్లను బాణసంచా తయారీ లేదా విక్రయ పనుల్లో పెట్టకూడదని, బాణసంచా విక్రయ కేంద్రాలు జనావాసాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు లేని ప్రదేశాల్లో దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. దీపావళి పండుగను అందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్యరహిత టపాసులనే వినియోగించాలని, పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112, స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.


ఎన్టీఆర్ క్రీడామైదానంలో బాణసంచా స్టాళ్ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

బాణసంచా స్టాళ్ల తనిఖీ

బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. క్రీడామైదానంలో 44 దుకాణలు ఏర్పాటు చేయడం జరిగిందని, భద్రతా ప్రమాణాలతో దుకాణాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చక్రవర్తి, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట్ నారాయణ, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐ సంతోష్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'అదానీ మీటర్లు వద్దు'


తిమ్మరాజుపేటలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న వినియోగదారులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో అదానీ మీటర్లు అమర్చేందుకు వచ్చిన విద్యుత్ సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. రైస్ మిల్లులు, వర్క్ షాపులకు ఆదానీ మీటర్లు బిగించేందుకు శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది రావడంతో పలువురు వినియోగదారులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా సీపీటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ మా మీటర్లు సక్రమంగానే పని చేస్తున్నాయని, మీటరులో లోపాలు ఉంటే తామే ఫిర్యాదు చేస్తామని, అంతేగాని తాము ఎటువంటి ఫిర్యాదు ఇవ్వకుండా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు మీరెవరని ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, అతని తనయుడు లోకేష్‌లు స్మార్ట్ మీటర్లను తాము వ్యతిరేకిస్తున్నామంటూ చెప్పి నేడు ఆ మీటర్ల బిగింపునకు పూనుకోవడం తగదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అదానీ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని ఆపాలని లేకుంటే సెక్షన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వినియోగదారులు సరిసా శివ, ఐతంశెట్టి కృష్ణవేణి తదితరులున్నారు.

పెద్దేరు నుంచి 400 క్యూసెక్కుల నీరు విడుదల


జలాశయం గేట్లు నుంచి విడుదల చేసిన నీరు

మాడుగుల రూరల్ : మండలంలో రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం నుంచి శనివారం రాత్రి 400 క్యూసెక్కులు నీరు స్పిల్‌వే గేట్లు ద్వారా దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, శనివారం నాటికి 136.65 మీటర్లకు చేరింది. ఆడపా దడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 193 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కురిసిన వర్షాల వల్ల జలాశయంలో చేరిన నీటిని దృష్టిలో పెట్టుకుని, స్పిల్ వే గేట్లు ద్వారా 400 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేశారు.

పోలీసు వలయంలోనే రాజయ్యపేట



నిరాహారదీక్ష చేస్తున్న మత్స్యకారులు (ఇన్‌సెట్) రాజయ్యపేట వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- 35వ రోజుకు చేరిన నిరాహారదీక్షలు

నక్కపల్లి : రాజయ్యపేట గ్రామం నివురు గప్పిన నిప్పులా ఉంది. ఏ క్షణం ఏజరుగుతుందోన్న టెన్షన్ నెలకొంది. బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహారదీక్ష శనివారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. నూకతాత ఆలయం వద్ద మత్స్యకారులు దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్షకు మద్దతుగా ఇతర గ్రామాల నుంచి వచ్చే వారిని పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రజా సంఘాలు, రాజకీయపార్టీ నాయకులను నక్కపల్లిలోనే అడ్డుకుని వెనక్కి పంపేస్తున్నారు. నాలుగోరోజు పోలీసు బందోబస్తు కొనసాగింది. వందలాది మంది పోలీసులు రాజయ్యపేట పరిసరాల్లో తిష్టవేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాజయ్యపేట, ఉపమాక, బుచ్చిరాజుపేట, బోయపాడు, దొండవాక, హెటిరో పరిశ్రమ సమీప ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాజయ్యపేట పరిసర ప్రాంతాలన్నీ పూర్తిగా పోలీసుల ఆధీనంలో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం సాయంత్రం రాజయ్యపేటలో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ వచ్చి గ్రామస్తులతో సమావేశం అవుతానని భరోసా ఇవ్వడం, బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు తాత్కాలికంగా నిలిపివేయడంతో మత్స్యకారులు శాంతియుతంగా నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. అయితే శనివారం బోయపాడు సమీపంలో బల్క్‌డ్రగ్ పనులు ప్రారంభమయ్యాయని తెలుసుకున్న కొంతమంది మత్స్యకారులు అడ్డుకునేందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే సీఐ మురళి రంగంలోకి దిగి పనులు ఆపివేయించడంతో వివాదం సద్దుమణిగింది. తమతో చర్చలు జరిపి తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పనులు ప్రారంభించరాదని మత్స్యకారులు స్పష్టం చేస్తున్నారు. దీక్షల శాంతియుతంగా ఉన్నంత వరకూ మత్స్యకారుల జోలికి వెళ్లమని, ఏదైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, ప్రభుత్వ ఆస్తులకు భంగం కలిగించినా చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

విద్యుత్ విప్లవంలో స్టార్టప్‌ల కోసం హ్యాకథాన్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ సరఫరా, వినియోగంలో సరికొత్త ఆధునిక విప్లవాన్ని సృష్టిస్తూ.. డిస్కమ్‌లకు, వినియోగదారులకు ఉపయుక్తమ య్యే స్టార్టప్‌ల కోసం హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అన్నారు. సృజనాత్మక ఆవిష్కరణలను రూపొందించే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో వచ్చే నెలలో హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హ్యాకథాన్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామన్నారు. హ్యాకథాన్‌లో ఎంపికైన స్టార్టప్‌లు తమ పరిష్కారాలను రాష్ట్ర విద్యుత్ రంగ ప్రముఖుల సమక్షంలో ప్రద ర్శించే అవకాశంతో పాటు విజేతలకు పైలెట్ ప్రాజెక్టులు, 3 డిస్క మ్‌ల్లో పూర్తి స్థాయి ప్రాజెక్టులను అమలు చేసుకునే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ హ్యాకథాన్‌ను ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్నా యన్నారు. ఈ నెల 22 రాత్రి 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

సోలార్ పవర్‌కు సూపర్ బూస్ట్.. జీఎస్టీ 2.0

ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ సోలార్ ప్లేట్స్ ప్రదర్శన

సాక్షి, విశాఖపట్నం: జీఎస్టీ 2.0 అమలు ద్వారా సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పాదనకు సూపర్ బూస్ట్ ఇచ్చినట్లని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్‌తో పాటు ఈపీడీసీఎల్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాష్, ఎస్ఈ జి.శ్యాంబాబు మొక్కలు నాటా రు. అనంతరం పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ ప్లేట్స్ ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. అనంతరంఆయన మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్ రేట్ల తగ్గింపు ద్వారా పునరుత్పాదక శక్తి పరికరాలపై 12 నుంచి 5 శాతనికి తగ్గించడం పెద్ద ప్రోత్సాహకమన్నారు. జీఎస్టీ 2.0 కారణంగా వినియోదారులకు రూ.10 వేలు ఆదా అవుతుందని తెలిపారు. బయో గ్యాస్ యూనిట్ ధరలో రూ.10,000, 5 హెచ్‌పీ సోలార్‌పంప్ సెట్ ధరలో కూడా రూ.29 వేల వరకూ ఆదా అవుతుందని వివరించారు. డైరెక్టర్ సూర్యప్రకాష్, ఎస్ఈ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్క గృహ వినియోగదారులు జీఎస్టీ 2.0, పీఎం సూర్యఘర్ పథకాల ద్వారా లబ్ధి పొందాలని, రూఫ్ టాప్‌పై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా కాలుష్యం నివారించవచ్చని సూచించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సోలార్ వెండర్లు పాల్గొన్నారు. అంతకు ముందు సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి ఎస్ఈ శ్యాంబాబు జీఎస్టీ 2.0 అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఛీ..ఛీ సేవలు బాలేవు!

- రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫిర్యాదులు
- 2023-24, 24-25లో దాదాపు 61 లక్షల ఫిర్యాదులు
- 2023-24తో పోలిస్తే 2024-25లో 11 శాతం పెరిగిన కంప్లైంట్స్
- ప్రతి 4 ఫిర్యాదుల్లో ఒకటి భద్రతపైనే..





రైళ్లలో ఫిర్యాదులకు సంబంధించి ప్రయాణికులు అప్‌లోడ్ చేసిన ఫొటోలు

సాక్షి, విశాఖపట్నం: రెండేళ్ల కాలంలో (2023-24, 2024-25) రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా ప్రయాణికులు ఏకంగా 60.96 లక్షలకు పైగా ఫిర్యాదులు చేశారు. 'రైల్ మదద్' హెల్ప్‌లైన్ (139), సోషల్ మీడియా, వెబ్‌సైట్ల ద్వారా ఈ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫిర్యాదులలో అత్యధికంగా భద్రతా లోపాలపై ఉండటం గమనార్హం. గత వార్షిక సంవత్సరంలో (2024-25) భద్రతకు సంబంధించిన ఫిర్యాదులే ఏకంగా 7.50 లక్షల వరకు నమోదయ్యాయి. దీనికి అదనంగా రైళ్లలో పరిశుభ్రత లేమి, విద్యుత్ పరికరాల వైఫల్యాలు, ఆహారం నాణ్యతపైనా ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో వందే భారత్, అమృత్ భారత్ వంటి అత్యాధునిక రైళ్లను ప్రవేశపెడుతూ రైల్వే శాఖ అప్‌గ్రేడ్ అవుతున్నా, రైలు ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకూ ప్రయాణికులకు అందించే ప్రాథమిక సేవలైన సీటింగ్, శుభ్రత, నాణ్యమైన ఆహారం విషయంలో మాత్రం లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆహారం నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నా వాటికి సరైన విధంగా స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆహారమంటే.. ఆమడ దూరం.!

ప్రయాణికులకు అవసరమైన శుచి, రుచికరమైన ఆహారం అందించాలన్నదానిపై మాత్రం రైల్వే మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. 2020-21లో 253 ఫిర్యాదులు మాత్రమే అందగా, 2021-22లో 1082కి పెరిగింది. ఫిర్యాదుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. 2022-23లో 4421 ఫిర్యాదులు నమోదు కాగా, 2023-24లో 7026, 2024-25లో 6645కి చేరుకుంది. గత ఐదేళ్లలో ఒక్క ఫిర్యాదుకే తీవ్రంగా స్పందించిన రైల్వే శాఖ.. ఆహారం అందిస్తున్న కాంట్రాక్టు సంస్థ లైసెన్స్‌ని రద్దు చేసింది. 3137 ఫిర్యాదులకు జరిమానాలు విధించగా.. 9627 ఫిర్యాదుల్ని పరిగణనలోకి తీసుకొని సదరు కాంట్రాక్టు సంస్థలకు హెచ్చరికలతో సరిపెట్టింది. ట్రైన్లలో ఆహారం అందించేందుకు దేశ వ్యాప్తంగా 20 సంస్థలతో రైల్వే బోర్డు ఒప్పందాలు కుదుర్చుకుంది.

భద్రత శూన్యం.. శుభ్రత మృగ్యం

2023-24లో రైల్వే సేవల్లోని అన్ని ఫిర్యాదులు కలిపి 28.96 లక్షలు వచ్చాయి. 2024-25 సంవత్సరంలో ఏకంగా 11 శాతానికిపైగా పెరిగి 32 లక్షలకు చేరుకుందంటే.. లోపం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైల్వే ప్రయాణంలో భద్రత అనేది ప్రయాణికులకు అతి పెద్ద సమస్యగా మారిందని ఫిర్యాదుల ద్వారా అవగతమవుతోంది. రైళ్లలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు గతేడాదితో పోలిస్తే.. 64 శాతం వరకూ పెరిగాయి. 2023-24లో 4.57 లక్షల ఫిర్యాదులు భద్రతకు సంబంధించి కాగా.. 2024-25లో 7.50 లక్షలకు చేరుకోవడం బాధాకరం. ప్రతి నాలుగు ఫిర్యాదుల్లో ఒకటి భద్రతకు సంబంధించింది ఉండటం గమనార్హం. అదేవిధంగా.. తర్వాత లోపం.. కోచ్‌లలో పరిశుభ్రత కరువవ్వడం. ఏడాది కాలంలో వచ్చిన ఫిర్యాదుల్లో కోచ్‌లలో అపరిశుభ్ర వాతావరణంపై 16.5శాతం వరకూ ఉంటున్నాయి. గతేడాదిలో ఏకంగా 8.44 లక్షల ఫిర్యాదులు అందాయి.

2023-24లో రైలు సేవలపై ఫిర్యాదులు- **28.96** లక్షలు

2024-25లో ఫిర్యాదులు **32** లక్షలు

భద్రతపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **7.50** లక్షలు

అపరిశుభ్రవాతావరణంపై వచ్చిన ఫిర్యాదులు- **8.44** లక్షలు

సమయపాలనపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **2.77** లక్షలు

2020-21లో ఆహారంపై వచ్చిన ఫిర్యాదులు- **253**

2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **6,645**

క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపును ప్రజలకు చేరువ చేయాలి



పట్టణంలో జీఎస్టీ సంబరాలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి


అనకాపల్లి టౌన్: జీఎస్టీ తగ్గింపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి సూచించారు. పట్టణంలోని మెయిన్ రోడ్‌లో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్‌పై శనివారం అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్స్ కార్యక్రమం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆమె రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయడం, వినియోగదారుల్లో సరైన అవగాహన కల్పించడం, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు పొదుపులపై స్పష్టతనివ్వడం కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ ఫెస్టివల్ సందర్భంగా స్థానిక వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: మండలంలోని బట్లపూడి పంచాయతీ రాయుడుపేట గ్రామంలో అనారోగ్యంతో అనుసూరి రమణ(42) అనే వ్యక్తి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మృతుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్వారీ బ్లాస్టింగ్‌లతో బెంబేలు

- కొండలు తవ్వి పోలవరం కాలువ నిర్మాణ పనులు
- పేలుళ్లకు ఇళ్లపై వచ్చి పడుతున్న రాళ్లు
- దుర్గానగర్ ఏరియాలో జనం అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కొండ సమీపాన ఉన్న దుర్గానగర్



బాంబు బ్లాస్టింగ్‌లు చేపట్టే కొండలు

పాయకరావుపేట : పట్టణంలో గల దుర్గానగర్ ఏరియాలో బాంబు బ్లాస్టింగ్‌ల కారణంగా కాలనీవాసులు బెంబేలు చెందుతున్నారు. పోలవరం కాలువ నిర్మాణం పనుల్లో భాగంగా పట్టణంలో గల దుర్గానగర్ సమీపాన గల కొండలను తవ్వి కాలువ నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ నిర్మాణ పనుల్లో భాగంగా కొండలపై రాళ్లు శిథిలం చేయడం కోసం బాంబులను ఉపయోగిస్తున్నారు. బాంబులతో కొండపై వున్న పెద్ద పెద్ద రాళ్లను బ్లాస్టింగ్ చేయడం వల్ల కొండలను ఆనుకుని పక్కనే వున్న దుర్గానగర్ వాసులు బేంబేలెత్తుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా బాంబులు పెట్టి రాళ్లను కొట్టడం కారణంగా కాలనీవాసులకు నిద్రపట్టడం లేదు.. సరికదా ఎప్పుడు ఎక్కడ మీద పడుతుందో అన్న భయంతో హడలిపోతున్నారు. రాళ్లు పేల్చేటప్పుడు ఎగిరిపడి రాళ్లు తమ ఇళ్లపై పడుతున్నాయని, ఆ సమయంలో ఎవరైనా ఇంటి బయట ఉంటే గాయాల పాలవుతున్నారని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికీ ఫలితం లేదన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటల వరకు బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారన్నారు. ఆ శబ్దాలు తమకు గుండె దడ కలిగిస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొండల పై బాంబు బ్లాస్టింగ్‌లు చేయకుండా పొక్లెయిన్‌లతో పనులు చేసుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇళ్లపై రాళ్లు పడుతున్నాయి..



పోలవరం కాలువ నిర్మాణ పనుల కారణంగా జరిపే బాంబు బ్లాస్టింగ్‌లు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రాళ్లు వచ్చి ఇళ్లపై పడుతున్నాయి. బ్లాస్టింగ్‌లు నిలిపివేసి జేసీబీలతో పనులు చేసుకోవాలని కోరుతున్నాం.

–ఆకుల రామచంద్రరావు, దుర్గాకాలనీ, పాయకరావుపేట

బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలి



పోలవరం కాలువ నిర్మాణ పనుల్లో పెద్ద పెద్ద రాళ్లను బ్లాస్టింగ్ చేయడం కోసం బాంబులను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రాళ్లు వచ్చి మా ఇళ్లపై పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో ఉన్నాం. అధికారులు స్పందించ బ్లాస్టింగ్‌లు నిలుపుదల చేయాలని కోరుతున్నాం.

–పక్కుర్తి శ్రీనివాసరావు, దుర్గానగర్, పాయకరావుపేట

స్వచ్ఛతా కార్యక్రమంలో కలెక్టర్ శ్రమదానం



డీఈవో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు

తుమ్మపాల : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని శ్రమదానం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. కలెక్టరు కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఆమె జిల్లా అధికారులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. స్వచ్ఛమైన గాలి అనే నినాదంతో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో వాహన కాలుష్యాన్ని తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రయాణాలకు ప్రజా రవాణా వాహనాలను ఉపయోగించడం, విరివిగా మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్ వినియోగం వంటి పద్ధతులను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అనంతరం డీఆర్వో వై.సత్యనారాయణరావు అధికారులతో 'ఒక అడుగు ముందుకు స్వచ్ఛతా వైపు' అంటూ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లో పలు విభాగాల అధికారులు విజయ కుమార్, వాసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో శుభ్రం చేస్తున్న పోలీసులు

అనకాపల్లి: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి అనుసంధానంగా జిల్లా పోలీసు విభాగం ఆధ్వర్యంలో 'వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణ'పై శనివారం ఎస్పీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. అనంతరం ఎస్పీ కార్యాలయం పరిసరాలను పోలీసులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐలు టి.లక్ష్మి, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యతను కూడా తీసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. స్థానిక డీఈవో కార్యాలయ ఆవరణలో పరిసరాలు పరిశుభ్రం చేసి వ్యర్థాలు తొలగించారు. ముందుగా కార్యాలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ వ్యర్థాల విడుదలకు టెండర్లపై ఫిర్యాదు



పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: ఒక వైపు బల్క్ డ్రగ్ పార్క్ రద్దు కోసం పోరాటం చేస్తుంటే.. మరోవైపు అధికారులు వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేసేందుకు టెండర్లు పిలవడం సమంజసం కాదంటూ పలువురు మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పర్యావరణ శాఖ, సీఆర్‌జడ్ అనుమతులు లేకుండా మెరైన్ అవుట్‌ఫాల్‌కు ఎలా టెండర్లు పిలుస్తారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మత్స్యకారుడు సోమేష్, తదితరులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఏపీఐఐసీ అధికారులు మత్స్యకారులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బల్క్ డ్రగ్ పార్క్‌లో ఏర్పాటయ్యే కంపెనీల నుంచి రోజుకు విడుదలయ్యే 52.72 లక్షల లీటర్ల వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేసేందుకు రూ.16.81 కోట్లకు టెండర్లు పిలవడం, ఈ నెల 27వ తేదీలోగా పూర్తి చేయాలని నోటిఫికేషన్ విడుదల చేయడంపై మత్స్యకారులు మండిపడుతున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ పనులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు హోంమంత్రి అనిత ప్రకటించారని, జాతీయ రహదారి ముట్టడిస్తే రాజయ్యపేట వచ్చి చర్చలు జరుపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్ చర్చలు ఇంకా పూర్తి కాలేదని, ఈ లోగా ఏపీఐఐసీ అధికారులు టెండర్లు పిలవడం తగదన్నారు. ఒక పక్క మత్స్యకారులతో చర్చలు జరుపుతూనే మరో పక్క ప్రభుత్వం కవ్వింపు చర్యలకు దిగుతోందన్నారు.

తల్లిదండ్రులను గాయపరిచిన తనయుడు అరెస్టు

- 14 రోజులు రిమాండ్



నిందితుడితో ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం : తల్లిదండ్రులను గాయపరిచిన తనయుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో చెర్లోపాలెం గ్రామానికి చెందిన పెదపూడి రవికుమార్ ఈ నెల 13న తల్లిదండ్రులతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తాతపై దాడికి పాల్పడినట్టు తెలిపారు. కుటుంబంలో ఆస్తి తగదాలు ఉండడంతో రవికుమార్ మద్యం సేవించి వచ్చి కుటుంబ సభ్యులను తీవ్రంగా గాయపరిచాడన్నారు. దీంతో తల్లిదండ్రులు ఇతర కుటుంబీకులు తీవ్ర గాయాలతో నర్సీపట్నంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించడం జరిగిందన్నారు.ఇటీవల కాలంలో మండలంలో తల్లిదండ్రులపై మద్యం సేవించి తగదాలు పడిన కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదులపై కేసు నమోదు చేస్తే కచ్చితంగా మూడు నెలలు జైలు శిక్ష పడుతుందని జరిమానా కూడా కోర్టు విధిస్తుందని, ఈ విషయాన్ని గ్రహించాలని ఎస్‌ఐ హెచ్చరించారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత



గొలుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత ఆరోపించారు. శనివారం ఏఎల్‌పురంలో తన ఇంటి వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే మహిళలను దారుణంగా వేధిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. కల్తీ మద్యం తాగి చనిపోతున్న వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయన్నారు. కూటమి నేతలకు డబ్బులు తప్ప ప్రజా సంక్షేమం అవసరం లేదన్నారు. కల్తీ మద్యంపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి జీడీ నెల్లూరులో మాట్లాడితే అదే నియోజకవర్గానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే థామస్ అతి దారుణంగా వ్యాఖ్యలు చేసి అవమానించారన్నారు. కృపాలక్ష్మికి ఎమ్మెల్యే థామస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మహిళను కించపరిచిన ఎమ్మెల్యేపై కూటమి సర్కార్ చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో గౌరవం ఇచ్చేవారని, అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించేవారని గుర్తు చేశారు. కూటమి పాలనలో మహిళల రక్షణపై ఆందోళన కలుగుతోందన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

బైక్ మీద తాటిచెట్టు పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



బైక్ మీద పడిన తాటిచెట్టు

మాడుగుల రూరల్ : మండలంలో వద్దాది నుంచి గాదిరాయి రహదారిలో ప్రయాణిస్తున్న బైక్ మీద తాటి చెట్టు కూలి పడి వ్యక్తి గాయపడిన ఘటన చోటు చేసుకుంది. వివరాలివి. శనివారం విద్యుత్ పనుల నిమిత్తం వీరవల్లి అగ్రహారం నుంచి జి.అగ్రహారం పోవు రహదారి మధ్యలో చెట్లు నరుకుతున్నారు. ఈ సమయంలో వీరవల్లి అగ్రహారం గ్రామానికి చెందిన బైన రామకృష్ణ, నాగభూషణం అనే ఇరువురు పల్సర్ బైక్ మీద జి.అగ్రహారం వైపు వెళ్తుండగా కొడుతున్న తాటి చెట్టు బైక్ మీద పడిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న బైన రామకృష్ణ నడుము విరిపోయింది. బైక్ వెనుక కూర్చున్న నాగభూషణంకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను వెంటనే అనకాపల్లి జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి తరలించారు.

పాఠ్య పుస్తకాల సమీక్షలో నాగజ్యోతికి అవకాశం



తన ప్రజెంటేషన్‌ను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డికి సమర్పించిన రోలుగుంట టీచర్ నాగజ్యోతి, తదితరులు

రోలుగుంట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ)ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాల పునఃసమీక్ష కార్యక్రమం విజయవాడలోని ఎస్‌జే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగింది. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాపులో రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన సబ్జెక్టు నిపుణులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల టీచర్ పీవీఎం నాగజ్యోతి కూడా పాల్గొని తన ప్రజెంటేషన్‌ను సమర్పించారు. ఈ వర్క్‌షాపు ద్వారా పాఠ్య పుస్తకాల పునః సమీక్ష, రూపకల్పనలో తన వంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు.

స్పజనాత్మకత, ప్రణాళికతో నాయకత్వ వికాసం



ఆచార్య ఆర్‌వీ రాజకుమార్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: సృజనాత్మకత, పటిష్ట ప్రణాళిక ద్వారానే నాయకత్వ వికాసం సాధ్యమని ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ ఆచార్యులు, ఆర్‌జీయూకేటీ వ్యవస్థాపక వీసీ ఆచార్య ఆర్‌వీ రాజకుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆయన 'ఒక ఆదర్శ విశ్వవిద్యాలయాన్ని సృష్టించడంలో నాయకత్వ సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. నిబద్ధత, దూరదృష్టితో పనిచేయాలని సూచించారు. ఆర్‌జీయూకేటీల స్థాపన, పరిమిత వనరులతో అభివృద్ధి, ఎదురైన సవాళ్లను ఆయన వివరించారు. తొలి బ్యాచ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన ఆచార్య రాజకుమార్‌ను ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సత్కరించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం : అచ్యుతాపురం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న డి. కావ్య 19వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పరవాడ ఎస్‌వీఎస్ కళాశాలలో నిర్వహించిన అండర్ 19 బాల, బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి గేమ్స్‌లో కబడ్డీలో పోటీల్లో రాణించిన కావ్యను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ మేరకు కావ్యను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బీబీ రాణి, ఆళ్ల రూప పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

యలమంచిలి రూరల్ : పట్టణంలోని శతకంపట్టు వద్ద కడిమిశెట్టి రమేష్ బుక్ స్టోర్‌లో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను స్వాధీనపర్చుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ కె. సావిత్రి శనివారం రాత్రి తెలిపారు. స్వాధీనం చేసుకున్న బాణాసంచా విలువ సుమారుగా రూ.8410 ఉంటుందన్నారు. దీంతో బుక్ స్టోర్ యజమాని కడిమిశెట్టి రమేష్‌పై కేసు నమోదు చేశారు.

చిరు వ్యాపారిపైకి దూసుకొచ్చిన లారీ



వియ్యపు అప్పయ్యమ్మ మృతదేహం





వియ్యపు అప్పయ్యమ్మ(ఫైల్), సాకేత్(ఫైల్)

- సంఘటన స్థలంలోనే దుర్మరణం
- ఆమె మనవడికి తీవ్ర గాయాలు

పెదగంట్యాడ,(విశాఖ) : శనివారం.. తెలవారుతున్న వేళ.. ఓ చిరు వ్యాపారిపై మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ఆమె మనవడు తీవ్రంగా గాయపడ్డాడు. వుడా డబుల్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలివి. పెదగంట్యాడ మండలం వియ్యపువానిపాలేనికి చెందిన వియ్యపు అప్పయ్యమ్మ (48) వుడా డబుల్ రోడ్డులో కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ప్రతి రోజూ ఉదయాన్నే ఆమె తన దుకాణాన్ని తెరుస్తూ ఉంటుంది. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో తన మనవుడు బంధం సాకేత్(5)తో కలసి దుకాణానికి వచ్చింది. అక్కడ కొబ్బరి బొండాలు సర్దుతుండగా శ్రీకాకుళం నుంచి పెదగంట్యాడకు ఇసుక లోడుతో వస్తున్న లారీ దుకాణంపైకి దూసుకొచ్చింది. దీంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందగా ఆమె మనవడు సాకేత్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే వియ్యపువానిపాలేనికి చెందిన అప్పయ్యమ్మ బంధువులు అక్కడకు చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనకాపల్లికి చెందిన లారీ డ్రైవర్ బారా గోవింద్(35)ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన సాకేత్ స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కుమారుడు వియ్యపు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూలో కొత్త డీన్ల నియామకం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నియమితులైన డీన్‌లకు ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు అందించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్‌గా ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, సెక్యూరిటీ విభాగం ప్రొఫెసర్ ఇన్‌చార్జిగా ఆచార్య సి.హెచ్.ఆశ ఇమ్మానియేల్ రాజు నియమితులయ్యారు. ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు కోఆర్డినేటర్లుగా ఆచార్య వై.రామకృష్ణ, ఆచార్య కె.పద్మలను నియమించారు. అంతర్జాతీయ విద్యార్థుల విభాగం అసోసియేట్ డీన్లుగా ఆచార్య ఎస్.ఎం.యుగంధర్, ఆచార్య ఎం.విజయశాంతి, యూజీ పరీక్షల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎం.మురళీకృష్ణ కుమార్ నియమితులయ్యారు. వీరిని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.కింగ్ అభినందించారు.

క్లుప్తంగా

సీసీరోడ్డు పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలతో ప్రారంభించినట్టు ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు తెలిపారు. ఈ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని, ఆయా ప్రాంతాల ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేట వీధిప్రజలు పాల్గొన్నారు.

23న మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 18 కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తోపాటు, జెరాక్స్ కాపీలను వెంట తీసుకుని రావాలన్నారు. వివరాలకు 8247505171 నంబరును సంప్రదించాలని కోరారు.

కార్మిక నేత మోదినాయుడుకు ఘన నివాళి



మోదినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

అనకాపల్లి టౌన్: వి.వి. రమణ చక్కెర కర్మాగారం షేర్ హోల్డర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, దివంగత గొర్లి మోదినాయుడు చక్కెర కర్మాగార సమస్యలపై అనేక పోరాటాలు చేశారని రైతు సంఘం కోశాధికారి విల్లూరి పైడి నాయుడు తెలిపారు. స్థానిక రైతు భారతి భవనంలో మోదినాయుడు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీకి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో నాయుడు కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో సుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కర్రి దివాకర్, ఏవీ నూకేశ్వరావు, గొర్లి శ్యామ్, కాండ్రేగుల విశ్వేశ్వరరావు తదితరలు పల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్ షటిల్ బ్యాడ్మింటన్‌లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు బాలురు డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 ఏళ్లలోపు విభాగంలో బి. రామ్ రిషిక్, 17 ఏళ్లలోపు విభాగంలో కె. సాయి రోహిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. వీరు ఆదివారం అనకాపల్లిలో డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 458 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	5,600	5,950
మొదటి రకం	4,320	5,900
రెండో రకం	3,880	4,900
మూడోరకం	3,600	3,860

అనకాపల్లి సినిమాలు

రాజా	: తెలుసు కదా
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: డ్యూడ్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: మిత్రమండలి
వెంకటేశ్వర	: మమ్మీ ఈజ్ బ్యాక్
రామచంద్ర	మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 452 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

దీపావళి శోభ





అనకాపల్లి: ఒకప్పుడు దీపావళి అనగానే అందరికి తక్కున గుర్తుకు వచ్చేది టపాసులు మాత్రమే.. ఇలా చెప్పాలంటే దీపావళి పండగను నెల రోజుల ముందుగానే చిన్న పిల్లలు చిన్నచిన్న టపాసులు కొనుగోలు చేసి కాల్చుతుండేవారు. నెలల పాటు ఎక్కడో ఒక చోట టపాసుల శబ్దం వినిపిస్తూనే ఉండేది. మారుతు్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో ఆలోచనా విధానం మారింది. టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతోపాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణంగా టపాసులను కాల్చడం చాలా వరకూ తగ్గించారు. దీపావళి రోజు మాత్రమే పిల్లల ఆనందం కోసం టపాసులు కాల్చుతున్నారు. పర్యావరణ ప్రేమికులతోపాటు అనేక మంది విద్యావంతులు దీపావళి పండగ రోజు టపాసులకు దూరంగా ఉంటున్నారంటే అతిశయోక్తి లేదని చెప్పాలి.



వివిధ రకాల ప్రమిదలు

ఎవరి స్థోమత వారిది...

దీపావళి సందర్భంగా ఇంటి ముంగిట ఏర్పాటు చేసే దీపాలను ఎవరి స్థోమతను బట్టి వారు వెలిగించుకుంటారు. వ్యాపారులు, ప్రజల అభిరుచికి అనుగుణంగా దీపాలను అందుబాటులో ఉంచారు. మహిళలు తమ ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలతో దీపాలను వెలిగించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది కాస్త ఖరీదైనా సరే ఆకర్షణీయంగా ఉండే వెరైటీ దీపాలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఒకప్పుడు మట్టి దీపాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. మారుతున్న కాలంలో మట్టి ప్రమిదలతో పాటు వివిధ రకాల మోడల్స్‌తో దీపాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్క దీపం రూ.5 నుంచి రూ.180 వరకూ ధర పలుకుతుంది. దీపావళి రోజు లక్ష్మీపూజ ఎంతో ప్రత్యేకమైనది, వ్యాపారులు లక్ష్మీదేవి ప్రతిమలను అందుబాటులో ఉంచారు.

ఆకర్షణీయమైన దివ్వెలతో శోభ



మారుతున్న కాలానికి అనుగుణంగా దీపాలు రూపాలు మారుతున్నాయి. గతంలో చిన్న మట్టి ప్రమిదలే అందుబాటులో ఉండేవి. గృహాలు వద్ద దివ్వెల్లో దీపాలను వెలిగిస్తే గృహాలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చిన్నారుల నుంచి వృద్ధులు వరకూ ఎంతో ఆనందంగా దీపావళి వేడుకలు నిర్వహిస్తారు. మందుగుండు సామగ్రి కాల్చే సమయంలో సిల్క్ వస్త్రాలు కాకుండా కాటన్ వస్త్రాలు వేసుకోవాలి, చిన్న పిల్లలు మందుగుండు కాల్చే సమయంలో పెద్దలు తప్పనిసరిగా ఉండాలి. ప్రమాదాలు బారిన పడకుండా చూడాలి.

-రావూరి అనిత, గ్రీన్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు, అనకాపల్లి

పర్యావరణం దృష్టిలో వేడుక చేసుకోవాలి



దీపావళి పండగ సమయంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. వృద్ధులు కూడా పర్యావరణ క్షీణతకు కారణమవుతుంది. పెద్దగా శబ్దం చేయని టపాసులతో దీపావళి మరింత ఆనందంగా నిర్వహించాలి. గాలి కాలుష్యంతో ఆస్తమా, ఇతర శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయి. నూనెతో వెలిగించిన మట్టి దీపాలు వల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ కలగదు. ఎకో ఫ్రెండ్లీ ఫైర్ వర్క్స్‌తో దీపావళి జరుపుకోవడం వల్ల గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం తగ్గుతుంది.

-కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు, అనకాపల్లి

మందుగుండు సామగ్రి విక్రయాలు...

పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 45 దుకాణాలు, డీసీఎంఎస్ కార్యాలయం, రింగ్‌రోడ్డులో బెల్లం మార్కెట్‌లో దుకాణాలు వద్ద ఆది, సోమవారాలు విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు ఇక్కడ నుంచే మందుగుండు సామగ్రిని కొనుగోలు చేసుకుని తీసుకుని వెళ్తారు. రెండు రోజుల పాటు వ్యాపార లావాదేవీలు రూ. 2 కోట్ల వరకూ జరుగుతాయి.



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో దీపావళి దుకాణాలు

క్రీడా మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు...

క్రీడా మైదానంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, పోలీస్‌లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక వాహనాన్ని ఇక్కడే నిలుపుదల చేశారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక తప్పనిసరిగా ఉంచాలని, దుకాణం దుకాణానికి ఐదడుగుల దూరంలో ఏర్పాటు చేశారు. దీపావళి సామాన్లు కొనుగోలు చేసే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు.



పాఠశాలల్లో సందడిగా దీపావళి వేడుకలు



మామిడిపాలెంలో హరిత దీపావళిపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్లో నరకాసురున్ని వధిస్తున్న దృశ్యం

అనకాపల్లి: హరిత దీపావళిని నిర్వహించడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చని హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. మండలంలో మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు హరిత దీపావళిపై శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దీపావళి అంటే దీపాలు అలంకరించి చేసే పండగని, పేలుడు పదార్థాలకు చోటు ఉండరాదని సూచించారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. విద్యార్థులు నూనె దీపాలను వెలిగించి పూలతో అలంకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వసంతరావు, సుజాత, కరుణ జ్యోతి, లక్ష్మి, రమణి, సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం, వెంకటేష్, శ్రీను, జగదీశ్వరి, వరప్రసాద్, అచ్యుత పాల్గొన్నారు.

ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్లో...

స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ మాట్లాడుతూ దీపావళి అనేది భారతదేశ ముఖ్యమైన పండగలలో ఒకటని, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి సూచికగా దీపావళి జరుపుకుంటారని పేర్కొన్నారు. అనంతరం చిట్టి పొట్టి చిన్నారులు శ్రీకృష్ణ, సత్యభామ వేషధారణలతో పాఠశాలకు విచ్చేసి నరకాసుర వధ దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించి, చూపరులను విశేషంగా ఆకర్షించారు. తదుపరి దీపాలు వెలిగించి, టపాసులు పేల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని గాయత్రి స్కూలులో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో ఆహూతులను అలరించారు. సంప్రదాయంగా లక్ష్మీదేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపావళి పండగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు దీపావళి నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చివరగా బాణసంచా కాల్చి ఆనందంగా సంబరాలు జరిపారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్, హెచ్‌ఎం వై. నగేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో సంప్రదాయ వస్త్ర ధారణతో విద్యార్థులు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



కశింకోట బాలికల హైస్కూలులో కబడ్డీ ఆడుతున్న బాలికలు



పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఉత్సాహంగా బాలికలు హాజరై ఆటల్లో రాణించారు. పోటీలను రెండు విభాగాల్లో నిర్వహించారు. 14 ఏళ్ల లోపు విభాగంలో వెదురుపర్తి హైస్కూలు, 17ఏళ్లలోపు విభాగంలో కశింకోట బాలికల హైస్కూలు విద్యార్థులు ఎక్కువ ఆటల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. పోటీలను వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, విద్యా కమిటీ సభ్యురాలు పి. కల్యాణి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, కూటమి నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు. 14 ఏళ్లలోపు ఖో-ఖోలో కశింకోట బాలికల హైస్కూలు, ఎఎస్ పేట హైస్కూలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వరుసగా నిలిచాయి. కబడ్డీలో వెదురుపర్తి హైస్కూలు, కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూలు, వాలీబాల్‌లో వెదురుపర్తి, జమాదులపాలెం హైస్కూళ్లు, షటిల్ బ్యాడ్మింటన్‌లో వెదురుపర్తి, కశింకోట బాలికల హైస్కూలు, యోగాలో కశింకోట బాలికల హైస్కూలు, తాళ్లపాలెం హైస్కూలు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు, చదరంగంలో తాళ్లపాలెం ఏపీ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికలకు ప్రథమ, నరసింగబిల్లిలో ద్వితీయ స్థానాలు లభించాయి. 17 ఏళ్లలోపు విభాగంలో ఖో-ఖోలో కశింకోట బాలికల హైస్కూలు, తాళ్లపాలెం గురుకుల పాఠశాల, కబడ్డీ, వాలీబాల్‌లో కశింకోట బాలికల హైస్కూలు, బయ్యవరం హైస్కూలు, యోగాలో కశింకోట బాలికల హైస్కూలు, తాళ్లపాలెం గురుకుల పాఠశాల, షటిల్ బ్యాడ్మింటన్‌లో వెదురుపర్తి హైస్కూలు, తాళ్లపాలెం గురుకుల పాఠశాల వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. శుక్రవారం బాలురకు నిర్వహించాల్సిన ఖో-ఖో, మిగిలిపోయిన కబడ్డీ జట్లకు కూడా శనివారం పోటీలు నిర్వహించారు. 17ఏళ్ల లోపు విభాగం బాలుర కబడ్డీలో కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూలు, ఏఎస్ పేట హైస్కూలు, 14 ఏళ్లలోపు విభాగంలో వెదురుపర్తి హైస్కూలు, తాళ్లపాలెం భార్గవి హైస్కూలు, ఖో-ఖోలో 17 ఏళ్ల విభాగంలో కన్నూరుపాలెం హైస్కూలు, కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూలు, 14 ఏళ్లలోపు విభాగంలో కన్నూరుపాలెం, ఏఎస్ పేట హైస్కూళ్ల బాలురకు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. పీడీలు వి. ప్రభాకరరావు, పెంటకోట కమల తదితరులు పర్యవేక్షించారు. పీడీలు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాలికల యోగా పోటీ



కబడ్డీ విజేత బాలుర జట్టుకు ఉపాధ్యాయుల అభినందన

'ఆలయాలకు ట్రస్టు బోర్డులను నియమించాలి'

అనకాపల్లి: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన దేవస్థానాలకు ట్రస్టు బోర్డులను తక్షణమే నియమించాలని ఆర్టీఐ, వినియోగదారుల చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ కోరారు. ఈ మేరకు సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్‌లకు 'ఎక్స్' వేదికగా పంపిన వినతిపత్రం వివరాలను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. ఏటా అయిదు కోట్లు ఆదాయం సమకూరుతున్న అనకాపల్లి నూకాంబిక (గవరపాలెం), సత్యనారాయణ స్వామి దేవాలయం (సత్యనారాయణపురం), జగన్నాథస్వామి దేవాలయం (అనకాపల్లి), భోగలింగేశ్వర స్వామి దేవాలయం (గవరపాలెం)లకు ట్రస్టు బోర్డుల నియామకంలో జరుగుతున్న జాప్యం వల్ల దేవాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందన్నారు. భక్తుల హక్కులకు భంగం కల్గుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణం ట్రస్టు బోర్డులను నియమించాలని కోరారు.

ఆక్రమణల పరిశీలన

మునగపాక: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఆక్రమణలపై లోకాయుక్తలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డివిజనల్ సర్వేయర్ వెంకన్న శనివారం పరిశీలించారు. ఇక్కడ మెయిన్ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ప్రస్తుతం ఉన్న రహదారికి ఒకవైపుగా కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదు మేరకు ఆయన స్థానిక అధికారులతో కలిసి రికార్డులు పరిశీలించారు.

పార్టీ నూతన కమిటీ సభ్యులకు సత్కారం



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తులకు పదవులు వస్తున్నాయని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అన్నారు. స్థానిక ఉడ్‌పేటలోని పార్టీ నేత జానీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కుండల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులు ఆడారి శ్రీనివాసరావు, అల్లు త్రినాథ్‌లను శనివారం ఆయన శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జానకీరామరాజు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణ పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

కశింకోట: మండలంలో బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పని సరిగా ఉండాలని, నిబంధనలు పాటించాలని, లేదంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ అల్లు స్వామినాయుడు, తహసీల్దార్ సిహెచ్. తిరుమలరావు హెచ్చరించారు. శనివారం రాత్రి వారు మాట్లాడుతూ బాణసంచా ప్రమాదాలు ఎక్కడా జరగకుండా ప్రశాంతంగా ప్రజలు దీపావళి పండగ జరుపుకునేలా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. బాణసంచా విక్రయ సమయంలో వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సామగ్రి భద్రపరిచిన గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇసుక, ఫైర్ ఇంజన్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్కొక్క దుకాణానికి 10 అడుగుల దూరం పాటించాలన్నారు. పరిమితికి మించి మందు గుండు సామగ్రి నిల్వ ఉంచరాదన్నారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, కశింకోట ప్రాంతాల్లో శనివారం సాయంత్రం, రాత్రి వర్షం కురిసింది. వీధులు బురదమయంగా మారాయి. గోతుల్లో నీరు చేరింది. దీంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.



తాళ్లపాలెంలో కురుస్తున్న వర్షం

వైభవంగా గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం



వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులు



అరటి గెలలు, పండ్ల పళ్లాలతో దర్శనానికి బారులు తీరిన ప్రజలు



అన్న సమారాధన

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో ప్రసిద్ధి చెందిన గౌరీ పరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్న గౌరమ్మ ఆలయాన్ని మండలంతో పాటు బుచ్చెయ్యపేట, అనకాపల్లి, యలమంచిలి మండలాలకు చెందిన ప్రజలు ఉత్సాహంగా తరలివచ్చి దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు, పండ్లు, తలనీలాలు తదితర రూపాల్లో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, సర్పంచ్ కర క రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కరక శేషు, ఒమ్మి గంగునాయుడు, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, గొంతిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఒమ్మి కోటేశ్వరరావు, ఒమ్మి సత్యనారాయణ, జనసేన నాయకుడు బాబు తదితరులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. గౌరమ్మను రాత్రి గ్రామ వీధుల్లో నిమజ్జనోత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, తప్పెటగుళ్లు, నేల వేషాలు ప్రదర్శించారు. డప్పులు, వాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ ఉత్సవ ఊరేగింపు అక్కడ జమాదులపాలెం కూడలి వద్ద జాతీయ రహదారి వరకు సాగింది. అనంతరం చెరువులో గౌరమ్మను సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా నిలుపు మహోత్సవం

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలోనే పేరుగాంచిన వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారు జాము వరకు జరిగింది. ముందుగా వేల్పుల గణేష్ ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరి పల్లె వారి పొలాల్లో వరి దుబ్బును సేకరించి పూజలు నిర్వహించారు. వరి దుబ్బును ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల వద్ద ఉంచి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టణంలోని చేపలబజార్, చిన్నవీధి, కుమ్మర వీధి, గాంధీబొమ్మ జంక్షన్, తాకాశివీధి, వేల్పులవీధి, తదితర ప్రాంతాల్లో ఊరేగించి మెయిన్ రోడ్‌లోని ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున ఐదు గంటల ప్రాంతంలో నెలకొల్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాము గరడి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గరికి వెంకట్రావు, నానేపల్లి రవి తగిన ఏర్పాటు చేశారు.

కశింకోట: గౌరీ సంఘం ఆధ్వర్యంలో కశింకోటలో గౌరీ పరమేశ్వరుల(గౌరమ్మ) విగ్రహం నిలుపు ఉత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని సంప్రదాయ డప్పులతో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. అనంతరం డీపీఎస్ జెడ్పీ హైస్కూలు వద్ద ఆలయంలో నెలకొల్పి ప్రత్యేక పూజలు సంప్రదాయంగా నిర్వహించారు. వెలంపేట గౌరీపరమేశ్వరులను ఊరేగించి స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు వద్ద ఆలయంలో నెలకొల్పారు.

ధ్యాన వేంకటేశ్వర స్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వజ్ర కవాచాలంకృతులను చేసి పూలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

బ్రాండిక్స్ సిబ్బందికి దీపావళి కానుక

అచ్యుతాపురం: బ్రాండిక్స్ సంస్థ పరిధిలో 14 వేల మందికి దీపావళి బహుమతులను యాజమాన్యం అందజేసింది. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం అదనపు టారిఫ్‌ల విధింపుల నేపథ్యంలో సంస్థ కష్టకాలంలో ఉన్నప్పటికీ సిబ్బందిలో మానసిక ధైర్యాన్ని నింపే విధంగా బహుమతులు పంపిణీ చేపట్టామన్నారు.